క్లుప్తంగా

నూకాలమ్మకు కోలగట్ల పూజలు

విజయనగరం: నూకాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరుకున్నారు. స్థానిక కర్రల మార్కెట్‌లో కొలువుదీరిన నూకాలమ్మను మంగళవారం ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు యడ్ల రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: నీటిని పొదుపుగా వాడాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వరల్డ్ వాటర్ డేని పురస్కరించుకుని కోనాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కుళాయిలను మంగళవారం ప్రారంభించారు. భూగర్భజలాలను పెంపొందేంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, పాఠశాల హెచ్‌ఎం చలం, గ్రామస్తులు అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

సింగవరంలో పొలంబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిర్మల

డెంకాడ: భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా పంటలకు ఎరువులు వినియోగించాలని ఏఓ పూడి నిర్మల రైతులకు సూచించారు. మండలంలోని సింగవరం గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఎరువుల వినియోగం, మొక్కజొన్నలో జీరో టిల్లేజ్ విధానం, సస్యరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ బి.రామకోటి, ఏపీసీడబ్ల్యూఎఫ్ సీఏ పి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదం

డెంకాడ: మండల కేంద్రమైన డెంకాడ గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న భూమి విషయంలో వివాదం రేగింది. ఆ భూమికి కొందరు కంచె వేయాలని ప్రయత్నించారు. అయితే అది ప్రభుత్వ భూమి అని, ఆ ప్రాంతంలో బోరు, నూకాలమ్మతల్లి గుడి, బావి వంటివి ఉన్నాయని స్థానికులు, గ్రామపెద్దలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీఆర్వో రామారావు ఆ స్థలాన్ని పరిశీలించి కంచె ఏర్పాటు పనులను అడ్డుకున్నారు. గ్రామస్తుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

మొబైల్ చోరీ నిందితుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి అతని మొబైల్‌ను లాక్కుని పరారైన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ ఏఎస్సై వై.పడితల్లి మంగళవారం తెలిపారు. ఈ నెల 20న బైక్‌పై వైఎస్సార్ నగర్ వెళ్తున్న ఆకి ప్రసాదరావును పప్పుల మిల్లు వద్ద ఇద్దరు యువకులు ఆపి అతని జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను తీసుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కుమ్మరవీధి జంక్షన్ వద్ద మంగళవారం ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

దగ్గు, జ్వరాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

సాలూరు: రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం క్షయ కావచ్చని టీబీ సూపర్‌వైజర్ నరేష్ అన్నారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నేరెళ్లవలస వారపుసంతలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గేటప్పుడు కఫం ద్వారా రక్తపు జీరలు పడడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడటం , జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా జయించవచ్చన్నారు.

మహిళలకు అండగా సమాఖ్య

విజయనగరం పూల్‌బాగ్: పీడిత మహిళలకు అండగా మహిళా సమాఖ్య పోరాడుతుందని రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని అన్నారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎం.మాణిక్యం, జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, ఉపాధ్యక్షురాలు షేక్‌చాంద్‌బీబీ, ఉంగరాల జయలక్ష్మి, లెంక వరలక్ష్మి పాల్గొన్నారు.

తెలగలను బీసీల్లో చేర్చాలి

విజయనగరం పూల్‌బాగ్: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల ప్రసాదరావు కోరారు. స్థానిక ఉడాకాలనీలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలగ కులస్తుల రిజర్వేషన్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. మంజునాథ్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.నరసింగరావు, ఉంగరాల అప్పలరాజు, జి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రాగి జావతో సంపూర్ణ పోషణ


పూసపాటిరేగ: విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


నెల్లిమర్ల: జరజాపుపేట హైస్కూల్‌లో విద్యార్థినికి రాగిజావ అందిస్తున్న నగరపంచాయతీ వైస్ చైర్మన్ రామారావు


నెల్లిమర్ల: గాంధీనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి రాగిమాల్ట్ అందిస్తున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్


భోగాపురం: ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ మైలపల్లి నర్సింహులు


డెంకాడ: పినతాడివాడ యూపీ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలోకి మరో పౌష్టికాహారం వచ్చి చేరింది. విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తున్న జగన్ సర్కార్ మరో అడుగు ముందుకు వేసి, రాగిజావ పంపిణీకి మంగళవారం శ్రీకారం చుట్టింది. ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అందించి, విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణకు ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో ఉదయం పూట బెల్లంతో కూడిన రాగిమాల్ట్(అంబలి) అందిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పూసపాటిరేగ మండలం కోనాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రాగిజావ పంపిణీ చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 26,300 మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

– సాక్షి నెట్‌వర్క్, విజయనగరం, నెల్లిమర్ల

మానవ మనుగడకు నీరు ఆవశ్యకం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు

భోగాపురం: భూమిపై మానవ మనుగడకు నీరు ఎంతో ఆవశ్యకమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా మండలంలోని నందిగాంలో సర్పంచ్ గరే మురళీమోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు లేకపోతే భూమిపై మానవులతో పాటు ఇతర ఏ ప్రాణికి మనుగడ ఉండదన్నారు. అందుకే నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఏపీఓ ఆదిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్, పడాల భానుప్రకాశ్, ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి


డెంకాడ: సావినార్‌ను ఆవిష్కరిస్తున్న రామమోహన్‌రావు, కళాశాల చైర్మన్ తదితరులు

డెంకాడ: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ కె.రామమోహన్‌రావు అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో పాటు నైపుణ్యాలు, సృజనాత్మకతను మెరుగుపర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. అనంతరం సావినార్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, సంస్థ గవర్నింగ్‌బాడీ మెంబర్ పీవీఎస్ రాజీవ్, ఈసీఈ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీమాఫీ

విజయనగరం: ఈ నెలాఖరులోగా ఆస్తి, ఖాళీ స్థలాలపై విధించిన పన్నులను ఒకేసారి చెల్లించి పూర్తి వడ్డీ రాయితీ పొందాలని కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పన్నులపై వడ్డీరాయితీ పథకంపై పన్ను చెల్లింపుదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. మొత్తం పన్నును ఒకేసారి చెల్లించిన వారికి మాత్రమే వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో, వార్డు సచివాలయాల్లో లేదా కార్పొరేషన్ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చన్నారు. పన్ను వసూళ్ల కోసం నగరంలో 12 ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం కమిషనర్ శ్రీరాములునాయుడును చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కాపుగంటి ప్రకాష్, రవ్వా శ్రీనివాస్, తదితరులు ఘనంగా సత్కరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతం

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


మహిళలకు చీరలు, స్టీల్ సామాగ్రి పంపిణీ చేస్తున్న కోలగట్ల శ్రావణి, అంధవరపు సూరిబాబు

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల సంతోషమే ప్రభుత్వ అభిమతమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. నగరంలోని బ్యాంక్ కాలనీ ప్రజాగ్రంథాలయం ఆవరణలో పట్టణ కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని నిరుపేద మహిళలకు చీరలు, స్టీలు సామగ్రి పంపిణీ చేశారు. కళింగ ఆర్యవైశ్య సంఘం చేపడుతున్న సేవాకార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కళింగ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల వెంకటరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమకుమారి, సంఘం ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి శ్రీరామ్మూర్తి, యువజన విభాగం అధ్యక్షుడు వారణాసి మల్లేశ్వరరావు, కార్యదర్శి డాకి సతీష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యాదవులను కించపరిస్తే సహించేది లేదు

విజయనగరం టౌన్: యాదవ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని రాష్ట్ర యాదవ హక్కుల పరిరక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఉన్న సమితి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ విప్ కూన రవికుమార్ గొర్రెల కాపరులు హీనులంటూ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయన తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు నొడగల అప్పలనాయుడు యాదవ్, బొంతు తిరుపతి యాదవ్, పడగల శ్రీనివాస్ యాదవ్, ముద్దాడ బాబూజీ యాదవ్, జాడ సురేష్ యాదవ్, ముద్దాడ మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వచ్చేనెల 6వ తేదీ నుంచి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పాలకవర్గ ప్రతినిధులు, అధికారులతో మంగళవారం సమీక్షించారు. నగర ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముందస్తు ప్రణాళికతో వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తెలుగు పండితులకు సత్కారం

విజయనగరం: పట్టణంలోని వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మహారాజ లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ఈ వేడుకల్లో వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి పాల్గొని మాట్లాడారు. హిందూ సంప్రదాయాలు, తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలుగు భాషా పండితులు సీహెచ్.పార్వతి, దశ గ్రంథాల వెంకటసుబ్రహ్మణ్యం, సరిపల్లి సోమేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ పూర్వపు గవర్నర్, సీనియర్ న్యాయవాది ఫోరెస్ రాజు, క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్.సాయిసంతోషిణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

నెల్లిమర్ల: ప్రైవేటు పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. విద్యా హక్కు చట్టం -2009 ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేదలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీనాటికి ఐదేళ్ల వయసు పూర్తికావాలని, స్టేట్ సిలబస్‌లో ప్రవేశాల కోసం జూన్ 1నాటికి ఐదేళ్లు నిండాలన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 10వ తేదీవరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 18, 29 తేదీల్లో రెండు విడతలుగా లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు ఎంఈఓ కార్యాలయాన్ని, సీఆర్పీలను సంప్రదించాలని ఎంఈఓ సూచించారు.